కథ

# శివోహం..

శైలజా మిత్ర
92909 00879

శివాలయం పాడుబడిపోయింది. గుడి అంతా పావురాలకు, బిచ్చగాళ్ల విశ్రాంతికి నెలవయింది. లోపలి నేలంతా గచ్చు ఊడి పోయి, మట్టి బయటపడిన చోటల్లా.. రావి మొక్కలు మొలుచుకు వచ్చాయి. గుడి తలుపులు వేసి ఉన్నా.. పందికొక్కుల స్వైరవిహారంతో ఆ గది నుంచి ఈ గదికి, ఈ గదినుంచి ఆ గదికి కన్నాలు చేసి మరీ కాపురం ఉంటున్నాయి.

చుట్టుకుపోయిన జుట్టుతో, గడ్డం పెరిగిపోయి, తైల సంస్కారంలేక మట్టి కొట్టుకుపోయినట్లున్న అవతారంతో, మోకాలు దాటిన మురికి పంచెతో, స్నానమే మరిచిపోయిన ఒంటితో.. అక్కడున్న వాటన్నిటినీ దాటుకుని వెళ్లాడు రాజయ్య. ఎంతో ఓపికతో ఒక మూలన తుడుచుకుని కూర్చుని.. అడుక్కోగా వచ్చిన అన్నాన్ని, రొట్టెముక్కలను తెరిచాడు. వాటిని తినాలని అతను ఎంత ఆత్రంగా ఉన్నాడో.. అంతకంటే ఆత్రంగా పావురాలు, వీధికుక్కలు, కాకులు అన్నీ అతణ్ని చుట్టుముట్టాయి. అయినా సరే, మరింత ఓపిక తెచ్చుకుని ఆ పక్కనే ఉన్న ఒక గట్టిపుల్లను అందుకుని..

'హుయ్!' అంటూ రొట్టెను ముక్కలు చేసి, కుక్కల వైపు వేశాడు దూరంగా..

అంతలో మునెమ్మ రానే వచ్చింది.

''రాజయ్యా! తింటున్నావా? తిను. ఈరోజు చాలా మంది దయతలిచినట్లు ఉన్నారే!?'' అంటూ.. ఆ పక్కనే ఉన్న చెత్తను కాలితో తోసి, పక్కనే కూర్చుంది.

అవునన్నట్లు తలూపి, ఒక బోసినవ్వు నవ్వి.. నీళ్లు తాగుతూ తింటున్నాడు రాజయ్య. కడుపు నిండా తిన్న తర్వాత.. మిగిలిన రొట్టెముక్కల్ని మళ్లీ అదే కాగితంలో చుట్టి, కవర్లో ఉంచి.. వెనుకగా పెట్టుకుని కూర్చున్నాడు ధైర్యంగా! ఇక రాత్రికి కూడా ఢోకా లేదన్నట్లు.. చేతులు కడుక్కొచ్చి మునెమ్మ పక్కనే కూర్చుని..

''నువ్వు తిన్నావా?'' అని అడిగాడు.

''ఆ.. ఆ తిన్నాలే! నాకేంటి? తిరపతమ్మ రోజూ ముద్ద పెడుతుందిగా! ఇప్పుడే నేను తిని పార్వతమ్మకు పెట్టి.. మెల్లగా తింటుంది కదాని వచ్చినా!'' అని చెప్పింది.

''కిట్టయ్య బాగున్నాడా?''.. భుజంపై వేసుకునే తుండుతో అక్కడున్న చెత్తను చెల్లాచెదురు చేసి, దానినే ఉండచుట్టి పడుకుంటూ అడిగాడు రాజయ్య.

''వాడికేం! కూలి చేసుకుంటాడు. ఆ వచ్చిన డబ్బులన్నీ సగం తాగుడుకూ, సగం ఆ ముండకూ తగలపెట్టి బువ్వకు మాత్రం గూటికి చేరుకుంటాడు. ఆడు అట్టుంటే నేనెట్లా బాగుంటాను?'' అన్నది విసుగ్గా.

ఆ మాటలన్నీ తనకు మామూలే అన్నట్లు నవ్వి..

''మగోళ్లు అంతే మునెమ్మా! ఆడకూతురివి.. నువ్వే సర్దుకుపోవాల!'' అన్నాడు రాజయ్య నెమ్మదిగా.

''ఇప్పుడు అదేగదా చేసేది. ఆడు సావడు.. నన్ను సంపడు. ఇగో రాజయ్యా.. నాకు గనక పార్వతమ్మ లేకుంటే ఎన్నడో సచ్చేదాన్ని'' అన్నది కోపంగా!

''బతకడానికి దేవుడు ఏదో ఒక ఆశ చూపుతాడు లేమ్మా! నన్ను చూడు.. నాకేమున్నదని బతుకుతున్నా? నాకోసం ఎవరూ లేరు. ఎందుకు బతుకుతున్నా? ఏదో ఒకనాటికి ఆ శివయ్య కరుణించకపోతాడా? నా ఒక్కగానొక్క కొడుకు శివయ్య నన్ను వెతుక్కుంటూ రాక పోతాడా!? అని ఆశ అంతే!'' అన్నాడు కళ్లకు అడ్డం పడిన నీటిని తుండుతో తుడుచుకుంటూ..

''అవును రాజయ్యా! ఆలయం పాడుబడ్డది కదా!? లోన శివుడు ఉంటాడా!?''..

ఆ మాట వినగానే ఫెళ్లున నవ్వాడు రాజయ్య..

''అట్టా నవ్వుతావేంది?''.

''నవ్వక ఏం చెయ్యమంటావు మునెమ్మా! ఈ మేడలు, ఆస్తులు, డబ్బు అన్నీ మనుషులకే కానీ.. ఆ పరమాత్మునికి కాదుకదా?'' అన్నాడు వేదాంతిలా!

''మరి నీకు ఆ పరమాత్మునిపై అంత నమ్మకం ఉంది కదా! మరి నీకు ఈ బిచ్చమెత్తుకునే రాత ఇచ్చాడు కదా? నీకు కోపం లేదా?''.

''ఎట్లోగట్లా.. ఎవరో ఒక అమ్మ అన్నం పెడుతున్నది. నా కడుపు నిండుతున్నది. ఈ గుడి కట్టంగానే ఆ నాయుడమ్మ సచ్చిపోయిందని ఆపేశారు. మళ్లా రాజారెడ్డి పనులు మొదలు పెట్టగానే.. ఆయన కూడా సచ్చిపోయిండని ఇట్లే వదిలేశారు. ఈ గుడిలో ఆళ్లిద్దరూ తిరుగుతున్నరని ఊరంతా పుకారు లేవదీశారు. ఇక పదేళ్లసంది ఈ గుడి ఇట్లే ఉన్నది. కాకుంటే.. నాలాంటి దిక్కులేని బిచ్చపోళ్లకు, పక్షులకు, కుక్కలకు ఇల్లయ్యింది. చాలదా?''.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.

''అవును రాజన్నా! అందరంటారు కదా! ఈ గుడిలో దెయ్యాలు ఉన్నాయని.. రాత్రివేళ చప్పుడు చేస్తాయని. నీకెప్పుడైనా కనిపించాయా? లోన చప్పుడు వినిపించిందా?''.

''బయటి మనసు లేని మనుషుల కన్నా ఈ దెయ్యాలే మంచివి అనుకుంటే ఏ దిగులూ ఉండదు. ఒకేల సంపిందనుకో.. సస్త! బతికుండి ఏమి చేయాల?'' అన్నాడు నవ్వుతూ.

''అట్టాగాదు. నీకు ఇనబడిందా? అని!''.

''నాకైతే ఏ దెయ్యమూ కనిపించలేదు. ఇక గుడిలోన పందికొక్కులు మస్తుగా ఉన్నయి. ఆటి పరుగుల్లో శబ్దాలైతే వినిపిస్తాయి. ఇందులో కుక్కలున్నాయి. పిల్లులు, బల్లులు, పాములు కూడా ఉన్నయి. అయితే పానం